క్లుప్తంగా

ఏపీ జేఏసీ కొవ్వూరు డివిజన్ చైర్‌పర్సన్‌గా మోహన భారతి



ఏపీ జేఏసీ మహిళా విభాగం కొవ్వూరు డివిజన్ నూతన కార్యవర్గం

తాళ్లపూడి: రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల మహిళా విభాగం కొవ్వూరు డివిజన్ జేఏసీని కొత్తగా ఏర్పాటు చేశారు. నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారు లక్ష్మి సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఏపీ జేఏసీ కొవ్వూరు డివిజన్‌కు చైర్‌పర్సన్‌గా తాళ్లపూడి మండలం డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి, ప్రధాన కార్యదర్శిగా అన్నదేవరపేటకు చెందిన ఉపాధ్యాయరాలు జేడీ సునీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ ప్రతి ప్రభుత్వ శాఖలోను మహిళా ఉద్యోగుల కంప్లయింట్ బాక్సులు ఏర్పాటు చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ కృష్ణ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

దేవరపల్లిలో అన్న సమారాధన

దేవరపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు దేవరపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సమారాధన జరిగింది.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

దేవరపల్లి: దుద్దుకూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పరిటాల కృష్ణ సతీష్ వైద్య ఖర్చులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం కృష్ణ సతీష్ తల్లిదండ్రులలకు రూ.15 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, నియోజకవర్గ నాయకుడు అనిశెట్టి గంగరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కొవ్వూరులో పసికందు వైద్యానికి..

కొవ్వూరు: పట్టణంలోని యానాద కాలనీకి చెందిన పొట్లూరి రామచంద్ర, దుర్గ దంపతుల ఏడు నెలల కుమారుడు ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. ఆ పసికందు వైద్య ఖర్చుల నిమిత్తం ఉభయ గోదావరి జిల్లాల డ్యాన్సర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున శుక్రవారం రూ.6 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముత్యాల శ్రీనివాసరావు, జి.యర్రన్న, భాస్కర్, బాబీ, సన్నీలు కలిపి ఈ సాయం అందజేశారు. పట్టణానికి దొడ్డా రమేష్ ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. నటరాజ్ డాన్స్ అకాడమీ విద్యార్థుల తరపున రూ.2 వేల నగదు అందజేశారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

నిడదవోలు రూరల్: మేజర్ పంచాయతీ అయిన సమిశ్రగూడెంలో హిందువుల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని హిందూ పరిరక్షణ కమిటీ నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సత్యనారాయణ శుక్రవారం మాట్లాడుతూ సమిశ్రగూడెం శివాలయం వద్ద గతంలో హిందూ శ్మశానవాటిక ఉండేదని, ప్రస్తుతం దానిని వినియోగించకపోవడంతో హిందువులంతా దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ బి.నాగరాజ్ నాయక్‌కు, పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ చెర్వులను కూడా రీసర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని ఆయన పేర్కొన్నారు.

నిడదవోలు సీఐగా తిలక్



నిడదవోలు: స్థానిక సీఐగా పి. వీర గంగాధర తిలక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేస్తూ ఆయన బదిలీలపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ వి.శ్రీనివాసరావు ఇటీవల పెరవలి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకున్న అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ పి. వీర గంగాధర తిలక్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణపై కృషి చేస్తానన్నారు.

పన్ను బకాయిదారుల కుళాయి కనెక్షన్ల తొలగింపు

నిడదవోలు: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, కుళాయి పన్నుల మొండి బకాయిల రికవరీకి అధికారులు చర్యలు చేపట్టారు. భారీ మొత్తంలో ఇంటి, కుళాయి పన్ను బకాయిలున్న పట్టణంలోని గాంధీనగర్, బాలాజీనగర్, విద్యానగర్ ప్రాంతాల్లోని ఇళ్ల వద్దకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు సిబ్బందితో కలసి వెళ్లారు. పన్ను బకాయిలు ఉన్న 8 మంచినీటి కనెక్షన్లు కట్ చేసి నీటి సరఫరాను నిలుపుదల చేశారు. బకాయిలు చెల్లించని పక్షంలో మున్సిపల్ చట్టం 1965 అనుసరించి మంచినీటి కనెక్షన్లను తొలగించి నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు.

ఉచిత సేవలకు బంక్

- పెట్రోల్ బంకుల్లో కనీస వసతుల లేమి
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- ప్రథమ చికిత్స కిట్లు కూడా లేని వైనం
- వేసవిలో తాగునీటికీ కటకట
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



నిడదవోలు పట్టణంలోని పెట్రోల్ బంక్



నిడదవోలు రైల్వే గేట్ వద్ద గల పెట్రోల్ బంక్

నిడదవోలు: పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయిస్తారని అందరికీ తెలుసు. వాటితో పాటు బంకుల్లో వినియోగదారులకు కొన్ని ఉచిత సేవలు అందించాల్సిన బాధ్యత కూడా వాటి యాజమానులపై ఉంది. ఈ విషయం చాలా మందికి తెలియక పోవడంతో యాజమాన్యాలు ఎలాంటి సదుపాయాలూ కల్పించడం లేదు. అప్పుడప్పుడూ తనిఖీలకు వచే అధికారుల సైతం ఈ విషయాలు పట్టించుకోవడం లేదు. ఎందుకంటే వారికి అందాల్సిన మామూళ్లు అందుతూనే ఉంటాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 30 పెట్రోల్ బంకులు ఉన్నాయి. నాలుగైదు బంకుల్లో మినహా మిగిలిన ఏ పెట్రోలు బంక్ యాజమాన్యమూ ఉచిత సేవలు అందించడం లేదు. నిడదవోలు పట్టణంలో 8, నిడదవోలు మండలంలో 8, పెరవలి మండలంలో 8, ఉండ్రాజవరం మండలంలో 6 పెట్రోల్ బంకులు ఉన్నాయి.

సౌకర్యాల తీరు ఇలా..

ఇంధనం కోసం పెట్రోల్ బంకులకు వచ్చే వాహనదారులకు విధిగా తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. వాహనదారులకు బంక్ నిర్వహణపై అసౌకర్యం కలిగినపుడు ఫిర్యాదు కూడా చేయవచ్చు. ఇందు కోసం ప్రతి పెట్రోల్ బంకులోనూ తప్పనిసరిగా ఫిర్యాదుల పుస్తకం ఉండాలి. వాహనాలకు ఉచితంగా గాలి పెట్టే యంత్రాలు ఉండాలి. చాలా బంకుల్లో అక్కడ పనిచేసే సిబ్బందికి మాత్రమే ఉపయోగపడేలా కార్యాలయ గదుల్లో తాగునీటిని ఉంచుతున్నారు. బంకుల్లో తప్పనిసరిగా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉండాలి. ఒకటి, రెండుచోట్ల మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ ఘోరంగా ఉంటున్నాయి. వాహనదారులు వాటిలో టాయ్‌లెట్‌కు వెళ్లలేనంత అధ్వానంగా ఉంటాయి. కొన్నిచోట్ల బంకుల్లో మరుగుదొడ్లు ఉన్నా నిత్యం వాటికి తాళం వేసి ఉంటుంది. తాళం వేసి ఉందని వినియోగదారులు అక్కడి సిబ్బందిని అడిగితే తమ యజమాని వద్ద తాళం చెవులు ఉన్నాయని ఆయన ఇంకా రాలేదని బదులిస్తున్నారు. దీనివల్ల దూర ప్రయాణాలు చేస్తూ మార్గ మధ్యలో పెట్రోల్ కోసం బంకులకు వస్తున్న వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు నానా అవస్థలూ పడుతున్నారు. 95 శాతం బంకుల్లో వాహనాలకు ఉచితంగా గాలి పెట్టె సదుపాయం లేదు. మొక్కుబడిగా ఆ యంత్రాలను బంకుల వద్ద ఉంచుతున్నారే తప్ప అవి పనిచేసే స్థితిలో ఉండవు. తెలిసిన వారు గాలి పెట్టమని ఆడిగితే 'గాలి యంత్రానికి మరమ్మతులు చేయాలి. మెకానిక్ విజయవాడ నుంచి రావాలి' అంటూ కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. ప్రయాణ సమయంలో అనుకోకుండా ప్రమాదం జరిగితే సమీప బంకు వద్ద చికిత్సకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండాలి. వాటిలో కాల పరిమితికి లోబడి మందులు ఉండాలి. చాలాచోట్ల ఇలాంటి బాక్సులు లేవు. మొక్కుబడిగా ఉన్నా అందులో పనికిరాని దూది, కాలం చెల్లిన మందులు ఉంటున్నాయి. వాహనదారులతో బంకు సిబ్బంది మర్యాద పూర్వకకంగా వ్యవహరించకుండా ఎంత కొట్టను, ఇలా రా.. అంటున్నారు. ఉచిత సేవలు వినియోగించుకునేలా సహకరించాలి. ఇంధన నాణ్యత, ధర, బంకు వేళలు, నిర్వాహకుడి ఫోన్ నంబర్, అత్యవసర సేవల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి. చాలా బంకులలో ఎక్కడా ఇలాంటివి కనిపించవు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే..



నిబంధనల ప్రకారం వినియోగదారులకు అవసరమైన వసతులేవీ పెట్రోల్ బంకుల్లో కానరావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల పట్టించుకోకపోవడం వల్లె ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. మండు వేసవిలో సైతం గుక్కెడు తాగునీరు కూడా లభించని పరిస్థితి బంకుల్లో ఉంది. మరుగుదొడ్లకు ఎప్పుడూ తాళాలు వేస్తున్నారు. వాహనాలకు గాలి కూడా పట్టడం లేదు.

– కోడి గోపి, న్యాయవాది, నిడదవోలు

నిబంధనలు అమలు చేయాలి



పెట్రోల్ బంకుల్లో నిబంధనలు సక్రమంగా అమలు చేయాలి. తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాలకు గాలి అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత యజమానులదే. పలు బంకుల్లో ఇటీవల వినియోగదారులకు కల్పించాల్సిన సదుపాయాలపై నోటీసులు ఇచ్చాం. బంకుల్లో సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకుని ఉచిత సదుపాయాలు కచ్చితంగా కల్పించాలి. లేని పక్షంలో కంజ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 ప్రకారం బంకు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

– ఎం. అనిల్‌కుమార్, సివిల్ సప్లై డీటీ, నిడదవోలు

జూనియర్ కళాశాలకు కంప్యూటర్ల అందజేత



కంప్యూటర్లతో వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆ కళాశాల 1984–1986 బ్యాచ్ విద్యార్థులు రూ.40 వేల విలువైన రెండు కంప్యూటర్లను విరాళంగా అందజేశారు. ఇటీవల జరిగిన ఈ బ్యాచ్ విద్యార్థుల 40 సంవత్సరాల ఆత్మీయ కలయికలో ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం వాటిని అందజేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల గరగ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలకు ఏ సాయం అవసరం అయినా తాము చేతనైనంత మేరకు చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొలుకుల వెంకన్నబాబు, ఇమ్మణ్ణి వీరశంకరం, పి రఘువీర్ శాస్త్రి, రామకృష్ణ, రామలక్ష్మి, అద్దాల డేవిడ్‌రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ సర్వీసుల రూట్ మళ్లింపు

నిడదవోలు: రోడ్డు మరమ్మతులు జరుగుతున్నందున నిడదవోలు డిపో నుంచి నరసాపురం మార్గంలో వెళ్లాల్సిన బస్సు సర్వీసుల రూట్ మార్చినట్లు నిడదవోలు ఆర్టీసీ డీఎం కె.వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కవిటం నుంచి మార్టేరు, పెనుగొండ నుంచి పెరవలి వరకూ ఆర్ అండ్ బీ ప్రధాన రహదారి మరమ్మతులు చేస్తున్నారు. దాంతో ఈ మార్గంలో వాహనాలను అనుమతించడం లేదు. ఈ కారణంగా శనివారం నుంచి పాలకొల్లు, లంకలకోడేరు, కాపవరం, నెలమూరు, మార్టేరు, పెనుగొండ, వడలి, సిద్ధాంతం, కండవల్లి, పెరవలి మీదుగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు డీఎం వివరించారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిద్దాం



సమావేశంలో మట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

చాగల్లు: మహిళా పారిశ్రామిక వేత్తలను గుర్తించి ప్రోత్సహిద్దామని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల సమఖ్య కార్యాలయంలో శుక్రవారం ఆయన స్వయం సహాయక సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక పథకాలు అందిస్తున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, చిన్న తరహా పరిశ్రమల బ్యాంక్ అధికారి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ డీపీఎం హేమంత్, ఏపీఎం ఈడూరి శ్రీనివాస బాబు, సీసీలు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో..

నిడదవోలు రూరల్: మహిళలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకు వచ్చేందుకు రాయితీతో కూడిన రుణాలను అందిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎస్.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. డ్వాక్రా మహిళలకు అందిస్తున్న స్త్రీనిధి, ఉన్నతి రుణాల లక్ష్యంపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో డీపీఎం హేమంత్, ఏపీఎం మహాలక్ష్మి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సీసీఎస్‌లు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నల్లజర్ల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో నల్లజర్ల హైస్కూల్ హెచ్‌ఎం కోమలీచిత్ర, ఉపాధ్యాయులు

నల్లజర్ల: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ఏలూరులో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాస్థాయి అండర్–14 ఖోఖో జట్టు ఎంపిక పోటీల్లో ఈ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని మైనం దుర్గాభవాని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ క్రమంలో ఆమె ఈనెల 27న చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అలాగే ఇదే పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి చిలక హర్షవర్ధన్ అండర్–14 అథ్లెటిక్స్, కబడ్డీ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా బొర్రంపాలెంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అతడు పై మూడు విభాగాల్లోను మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. ఈ క్రమంలో హర్షవర్ధన్ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలో నవంబరు 8,9,10 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. అలాగే హర్షవర్ధన్ నవంబరు 6,7 తేదీల్లో కైకలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని ఆ పాఠశాల హెచ్‌ఎం కోమలి చిత్ర తెలిపారు. పాఠశాల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థులను, పీడీ టి.త్రిపురస్వాతిని హెచ్‌ఎం కోమలీ చిత్ర, విద్యా కమిటీ చైర్మన్ కోడూరి నారాయణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తాడిమళ్ల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తాడిమళ్ల హైస్కూల్ విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

నిడదవోలు రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు ఎంపికైనట్టు హెచ్‌ఎం సూర్యనారాయణ శాస్త్రి శుక్రవారం తెలిపారు. ఈనెల 23న జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్–17 విభాగం కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు టి.దివ్యశ్రీ , కె.దివ్యహర్షిణి, ఎస్.శ్యామల దుర్గలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. పీడీ బండి ప్రదీప్, విద్యార్థినులను ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి 21వ పశుగణన



చాగల్లులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చాగల్లు: దేశ వ్యాప్తంగా శనివారం నుంచి 21వ పశుగణన చేపడుతున్నట్టు మండల పశు వైద్యాధికారి ముఖేష్ చెప్పారు. స్థానిక పశు వైద్యశాలలో శుక్రవారం ఆయన పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ అన్నిరకాల పశువుల సంఖ్యను నమోదు చేయడమే గాకుండా, వాటి జాతి, వయస్సు, లింగం వంటి వివరాలను సేకరిస్తామన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, పందులు, గుర్రాల వంటి పశువులు, పక్షులు కూడా ఈ గణనలో భాగమవుతాయన్నారు. పశు గణన నిర్వహణకు మండలంలో 11 మంది సర్వేయర్లను ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ టెక్నాలజీ ద్వారా వారు ఈ సమాచారాన్ని సేకరించి, ప్రభుత్వానికి అందిస్తారన్నారు. శనివారం నుంచి ప్రతి గ్రామంలో పశు సంవర్ధక సహాయకులు ఇంటింటికీ వచ్చి పశువుల వివరాలు నమోదు చేస్తారన్నారు. పశువులకు చెవి పోగులు వేసి యజమాని వివరాలు, పశువుల సమగ్ర సమాచారం నమోదు చేస్తారని చెప్పారు. పాడి రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, నాదెల్ల శ్రీరామ్‌చౌదరి,ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కొవ్వూరు: దేశవ్యాప్తంగా శనివారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ నిర్వహించే పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణన రానున్న రోజుల్లో ప్రభుత్వం ద్వారా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలకు మేలు చేకూర్చేందుకు ఉపకరిస్తుందన్నారు. పట్టణంలో టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు సుంకవల్లి సత్యనారాయణ, ఏడీ ఎ.వెంకటరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన



నిడదవోలులో స్థలం పరిశీలిస్తున్న చైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, ఎస్సై శోభన్‌కుమార్

నిడదవోలు: నిబంధనలకు అనుగుణంగా బాణసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి.కృష్ణవేణి, పట్టణ ఎస్సై శోభన్‌కుమార్, నిడదవోలు అగ్నిమాపక అధికారి సుబ్బారావు పట్టణ శివార్లలోని శుక్రవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. పట్టణ శివారున కోటసత్తెమ్మ వారి ఆలయం వెనుక భాగంలో ఖాళీ స్థలాలు, మాంటిస్సోరి స్కూల్ వద్ద గల మున్సిపల్ స్థలం, ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు భాగంలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. వీటిలో దుకాణాలకు అనువైన ఒక స్థలాన్ని ఎంపిక చేస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు.

విక్రేతలు నిబంధనలు పాటించాలి

గోపాలపురం: బాణసంచా విక్రయించే దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. దీపావళి సందర్భంగా గోపాలపురంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు సేల్స్‌టాక్స్, అగ్నిమాపక, పోలీసులు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మండలంలోని చిట్యాల, దొండపూడి, గోపాలపురం గ్రామాల్లో సుమారు 10 దుకాణాల ఏర్పాటుకు అనుమతి కోరుతూ దరఖాస్తులు అందినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట వీఆర్వోలు సునీత, లక్ష్మి శ్రీనివాస్ ఉన్నారు.

'దూరవిద్య' అడ్మిషన్లు పెంచాలి

చాగల్లు: టెన్త్, ఇంటర్మీడియట్ దూరవిద్య తరగతుల అడ్మిషన్లు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ రాష్ట్ర పరిశీలకుడు జి.గోపీకృష్ణ సూచించారు. చాగల్లులోని ఓపెన్ స్కూల్ సెంటర్లను శుక్రవారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల ప్రకారం మాత్రమే పదోతరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దూర విద్య విధానంలో ఆయా సెంటర్లలో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పి. వీర్రాజు, పి. సత్యనారాయణ, ఆర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న కొవ్వూరు మునిసిపల్ సమావేశం

కొవ్వూరు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు తెలిపారు.కావున సభ్యులంతా విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మూడు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెం, చివటం, సత్యవాడ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చివటం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చివటం ప్రధాన రహదారితో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ పనులను పర్యవేక్షించిన మండల శానిటేషన్ కో–ఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ మాట్లాడుతూ మండలంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాదరావు, రత్నం, విజయకుమారి, ఆశాలు విజయలక్ష్మి, సంధ్యారాణి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థినులకు స్థానిక సామాజికవేత్త చిట్టూరి సుజాత యూనిఫాం అందజేశారు. పది మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రెండేసి జతల చొప్పున 20 జతల యూనిఫాంను శుక్రవారం హైస్కూల్లో అందజేశారు. అలాగే అలాగే ఇద్దరూ పేద విద్యార్థినులకు ఆమె ఇంటర్ ఎగ్జామ్ ఫీ కట్టారు. బాగా చదివిన బాలికలకు మరింత తోడ్పాటు అందిస్తామన్నారు. ఏటా విద్యార్థినులకు యూనిఫాం ఇవ్వాలని ఉపాధ్యాయిని బూరుగుపల్లి పద్మజారాణి కోరగా, అందుకు దాత చిట్టూరి సుజాత అంగీకరించారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



పాలంగి రెవెన్యూ గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఉండ్రాజవరం: ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ హరి ప్రసాద్ అన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించేందుకు శుక్రవారం పాలంగి గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వే సందర్భంగా రైతులు ఎవరికైనా పొలాల హెచ్చుతగ్గులు ఉంటే అర్జీల రూపంలో అందజేస్తే వాటిని సరి చేస్తామన్నారు. గ్రామసభలో మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి హసన్ జానీ, వార్డ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ



మైత్రీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రాజారావు

గోపాలపురం: ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది కలగకుండా రెవెన్యూ, వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై చర్చించేందుకు రైస్‌మిల్లర్లు, సొసైటీల కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయ, అనుబంధ శాఖల ఉద్యోగులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మైత్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో క్వింటా ధాన్యం రేటు రూ.2300గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, కోమటికుంట, వెంకటాయపాలెం రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.